క్లుప్తంగా

పొలాలు ఎండుతున్నా నాయకులకు పట్టదా..?

నర్మెట: మండలంలోని రైతుల పొలాలు నీరు లేక ఎండిపోతున్నా నాయకులు స్పందించక పోవడం విడ్డూరంగా ఉందని యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షుడు యాటా క్రాంతి కుమార్ అన్నారు. మండలంలోని హన్మంతాపూర్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిమాదిరి పాలన ఉందని, మండలంలో నాలుగు రిజర్వాయర్లు నీరులేక అలంకార ప్రాయంగా మారి రైతులను కంటతడి పెట్టిస్తున్నాయన్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రిజర్వాయర్లకు నీరును వదలాలని కోరారు.

రజకులకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి



పాలకుర్తి టౌన్: రజకులకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్టీలు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబరాజు రవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రజక కులస్తుల ఓట్లకు గెలుపోటములను ప్రభావితం చేసేంత సత్తా ఉందన్నారు. అన్ని పార్టీలు ఐదు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని కోరారు. నాయకులు చిట్యాల రామచంద్రం, గుమ్మడి రాజు సాంబయ్య, చిట్యాల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక



పాలకుర్తి: శ్రీ సోమేశ్వర ఆటో యూనియన్ పాలకుర్తి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగుల భిక్షపతి, ఉపాధ్యక్షులుగా బక్క నగేష్, పులి భాస్కర్, కోశాధికారిగా పసులాది అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రామాల్లో ముందస్తు హోలీ సంబురాలు



బచ్చన్నపేట: గ్రామాల్లో ముందస్తు హోలీ సంబురాలు ప్రారంభమయ్యాయి. హోలీ పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో చిన్నారులు కోలలతో జాజిరి ఆడుతూ, పాడుతూ తిరుగుతున్నారు. ఈ నెల 7వ తేదీన హోలీ పండుగ సందర్భంగా రాత్రి వేళ చిన్నారులు కోలలతో ఇంటింటికి వెళ్లి జాజిరి ఆడిపాడి వారు ఇచ్చింది తీసుకుంటున్నారు.

'ఆర్ఎంపీ, పీఎంపీ కమిటీ ఎన్నికలు నిర్వహించలేదు'

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నూతన రాష్ట్ర, జిల్లా, మండల ఎన్నికలు నిర్వహించలేదని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెండోట వెంకటాచారి, రాష్ట్ర నాయకుడు పాము ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి మంతిని రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా లొంక మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా మాన్యపు నాగేష్, ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి సుధాకర్, కోశాధికారిగా విద్యాసాగర్ కొనసాగుతారని తెలిపారు. కొత్త కమిటీ పేరుతో అసత్య ప్రచారం నమ్మొద్దని తెలిపారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



జనగామ రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ఇండియా కరెన్సీపై ముద్రించి గొప్పతనం చాటేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరుపోతుల పరుశురామ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రజా యుద్ధనౌక గద్దర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మార్చి చివరి వారంలో ఢిల్లీలో నిర్వహించే మహాధర్నాకు రావాలని ఆహ్వానించారు.

వైభవంగా తిరుమలనాథ కల్యాణం

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని శ్రీతిరుమల నాథ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీతిరుమలనాథస్వామి, పద్మావతి అమ్మవారి కల్యాణాన్ని ఆదివారం మధ్యాహ్నం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు, అర్చకులు మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోయుక్తంగా చేపట్టారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకాగా ఆలయ ప్రధాన పూజారి కలకోట రామానుజచార్యులు, ఆలయన అభివృద్ధి కమిటీ చైర్మన్ రంగాచార్యులు, అర్చకులు శేషాచార్యులు, జీడికంటి వరుణాచార్యులు, సంతోషాచార్యులు, సద్గుణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. కనులపండువగా జరిగిన కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తి తన్మయత్వంతో పులకించారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, స్వామివారి కల్యాణానికి ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ దంపతులు హాజరై కల్యాణ పూజలో పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, యాగశాల నిర్మాణదాత గన్ను శ్రీనివాస్



పూజ చేస్తున్న ఘన్‌పూర్ ఏసీపీ దంపతులు

సునీత దంపతులు, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, భక్తులు నీల గట్టయ్య, మహంకాళి రవీందర్, కుంభం నరేందర్, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ తెల్లాకుల రామకృష్ణ, కొలిపాక సతీష్, సరాబు ఆంజనేయులు, నాగబండి వెంకట్రామనర్సయ్య, యాద శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

జనగామ: మరణానంతరం నేత్రాలు దానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాలని సదాశయ ఫౌండేషన్ సాయి శ్రవణ్ లయన్స్ క్లబ్ జనగామ రీజినల్ చైర్మన్ ప్రమోద్ కుమార్, జనగామ రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి అన్నారు. పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన బౌరిశెట్టి లక్ష్మి గత నెల మృతి చెందగా, ఆదివారం నిర్వహించిన సంస్మరణ సభలో వారు పాల్గొని మాట్లాడారు. మృతిచెందిన తర్వాత నేత్ర, శరీర అవయవాలను దానం చేసి మనలోని మానవత్వాన్ని చాటుకోవాలన్నారు. రెండు రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులు లలితసాగర్, కవితరాజు, అనితప్రవీణ్‌లు లక్ష్మి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. అంతకు ముందు లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల



నేత్రదానం సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతినిధులు

ఐక్య వేదిక కన్వీనర్ జి.కృష్ణ, పోతన వేదిక ప్రతినిధి డాక్టర్ కల్నాల్ మాచర్ల భిక్షపతి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, భీష్మాచారి, సంపత్ రాజ, అంకూరి శివ, సిద్దులు, నర్సింహులుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్మృతి వనం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మదార్

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో వీరనారి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరుతో ఐదు ఎకరాల్లో స్మృతి వనం ఏర్పాటు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదార్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజకులకు స్వయం ఉపాధి కోసం విద్యుత్ ఇస్త్రీరి పెట్టెలు, 50 ఏళ్లు నిండిన రజకులు రు. 3వేల పింఛన్ ఇవ్వాలన్నారు. రజకులకు సామాజిక రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని, డబుల్ బెడ్రూం ఇళ్లలో రజకులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, లొంక ఐలయ్య, జ్యోతి యాదగిరి, వేముల రాజములు, పోలాస సోమయ్య, చిట్యాల మధు, సురేష్, ఎల్లయ్య, లొంక శ్రీనివాస్, సోమయ్య, నాగన్న, వెంకన్న మచ్చా ఎల్లయ్య, సోమయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



జనగామ: వేసవి ఉష్ణోగ్రతలు మండి పోతుండడంతో ప్రజల దాహార్తిని తీర్చేందేందుకు దాత కల్నల్, డాక్టర్ మాచర్ల భిక్షపతి ఆధ్వర్యాన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆదివారం ఆర్టీసీ డీఎం జ్యోత్స్నతో కలిసి ఆయన చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్నల్ మాట్లాడుతూ రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుందన్నారు. దీంతో శరీర ఉష్ణోగ్రతల మార్పులతో శరీరంలో డీహైడ్రేషన్‌తో అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అనేక పనుల కోసం జనగామకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చాలనే సంకల్పంతో చలివేంద్ర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎం మట్లాడుతూ ప్రజల గొంతు తడిపేందుకు డాక్టర్ ముందుకు రావడం అభినందనీయమన్నారు.

సబ్సిడీ ఎరువులకు కులం నమోదు సరికాదు

జనగామ రూరల్: సబ్సిడీ ఎరువులు పొందాలంటే కులాన్ని నమోదు చేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖ వివాదస్పద ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చందు నాయక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువుల రాయితీ కోసం షాపుల్లో కులానికి సంబంధించిన సమాచారం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలనే కేంద్ర నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు



మాట్లాడుతున్న చందు నాయక్

సోమయ్య, సారయ్య, బీరయ్య, మీట్యానాయక్, రాజు, యాకయ్య పాల్గొన్నారు.

దేవాదుల ద్వారా సాగు నీరు అందించాలి

జనగామ రూరల్: జనగామ నియోజక వర్గంలోని హన్మంతాపూర్, మల్కాపేట, అడవికేశావాపూర్, గానుగుపహడ్, ఎర్రగొల్లపహాడ్ గ్రామాల్లో దేవాదుల కింద సాగు చేస్తున్న రైతుల పంటలు కాల్వల ద్వారా నీరు అందక ఎడుతున్నాయి. కాగా, పంటలకు నీరు అందించాలని కోరుతూ ఆదివారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మంత్రి దయాకర్‌రావును కలిసి విన్నవించారు. ఈ మేరకు ఈ నెల 9 నుంచి నీటిని అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బి.యాదగిరి,



మంత్రితో ప్రజాప్రతినిధులు

సర్పంచ్‌లు శ్రీనివాస్, జయరాం, శంకర్, నర్సయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్‌తో న్యూ స్టార్ చైనీస్ కుంగ్‌ఫూ విద్యార్థులు

జనగామ రూరల్: ఇంటర్ స్టేట్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్–2023 పోటీల్లో న్యూస్టార్ చైనీస్ కుంగ్‌ఫూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారని గ్రాండ్ మాస్టర్ ఎండీ సలీం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే షాటోకాన్ మాస్టర్ వి.నాగమహేష్ ఆధ్వర్యంలో కాజీపేట వాసవీకల్యాణ మండపంలో నిర్వహించిన పోటీల్లో కటాస్ విభాగంలో అభిషేక్ సిల్వర్, దైవిక్ గోల్డ్ మెడల్ సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా సెక్రటరీ గుగ్గిళ్ల దేవేందర్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

కొనసాగుతున్న దీక్షలు

జనగామ రూరల్: పట్టణంలోని మూడో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని ఇళ్ల సాధన కమిటీ సహాయ కార్యదర్శి ఎ. మల్లేష్ కోరారు. చిట్యాల ఐలమ్మ నగర్ డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద లబ్ధిదారులు చేపట్టిన దీక్షలు శనివారం 25వ రోజుకు చేరాయి. దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇచ్చిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 6 నెలల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని



మాట్లాడుతున్న మల్లేష్

లబ్ధిదారుల సమస్యను పరిష్కరించాలని కోరారు. పోరాట కమిటీ అధ్యక్షుడు కళ్యాణ లింగం, భవాని, స్వరూప, ఆనంద్, శశిరేఖ, సంతోష, రాములు తదితరులు పాల్గొన్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే రాజయ్య



లింగాలఘణపురం: మండలంలోని కుందారంలో మృతి చెందిన కాచరాజు గీతాప్రసాద్‌రావు మృతదేహాన్ని ఆదివారం ఎమ్మెల్యే రాజయ్య సందర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడెను మోసి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో వార్డు సభ్యురాలు నీలం భాగ్యవతి అత్త నీలం నర్సమ్మ అనారోగ్యంతో మరణించగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా నర్సమ్మ మృత దేహానికి డాక్టర్ కల్నల్ భిక్షపతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, నాయకులు యాకయ్య, అంతగల్ల రాంచందర్, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

బెంచీల వితరణ

జనగామ: జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ, యశోదారెడ్డి చొల్లేటి మెమోరియల్ ట్రస్టు చైర్మన్, దాత చొల్లేటి రాజనరేందర్‌రెడ్డితో పాటు మరికొంతమంది దాతలు కరుణ, ప్రీతి, దామోదర్‌రెడ్డి, రమేష్ ఆదివారం బెంచీలు అందించారు. విద్యార్థుల సౌకర్యార్థం రూ.1.50 లక్షల విలువ చేసే 40 బెంచీలను అందించగా, భవిష్యత్‌లో మరిన్ని అందించేందుకు ప్లాన్ చేస్తున్నామని ఎన్ఆర్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కిరణ్ కుమార్‌గౌడ్

జనగామ: జనగామ మండలం ఎల్లంలలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన మామిడాల జాంగీర్ కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం నాగపురి కిరణ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండలం ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండ లక్ష్మి వెంకటేష్, పీఏసీఎస్ డైరెక్టర్ మడిపల్లి సుధాకర్, మాజీ ఎంపీటీసీ దేవునూరి చంద్రయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బక్క శ్రీను, యూత్ అధ్యక్షుడు దండు రాజు, రాములు, యాదగిరి, సాయి, అచ్చయ్య, కనకరాజు, మహేందర్, వీరస్వామి, రాజు, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

పేదల పెన్నిధి కేసీఆర్

నర్మెట: పలు సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్ పేదల పెన్నిధిగా నిలిచారని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అమ్మాపురానికి చెందిన వలాద్రి మధుసూదన్‌రెడ్డి అనారోగ్యంతో ఇటీవల చికిత్స పొందారు. కాగా రూ.1.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం అందజేశారు. నాయకులు పుట్ట కృష్ణంరాజు, ఉపసర్పంచ్ బైరగోని లక్ష్మయ్య, గాల్‌రెడ్డి, చెక్కిల్ల రాములు, వెంకటేశ్వర్లు సురేందర్, గంగం ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, శ్రవణ్, బాలనర్సు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీశైలం, నర్సిరెడ్డి, ఉదయ్ రాజు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ ర్యాలీ

మడికొండ: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో మడికొండలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ.. మడికొండ సెంటర్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు.

ఆటో బోల్తా.. పలువురుకి తీవ్ర గాయాలు

జనగామ రూరల్: ప్యాసింజర్ ఆటో అదుపుతప్పి గుంతలో బోల్తాపడటంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి జనగామ చంపక్‌హిల్స్ ఎంసీహెచ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రఘునాథపల్లి మండలం నిడిగొండకు చెందిన ఆటోడ్రైవర్ లింగరాజు బచ్చన్నపేట మండలంలో ఓ విందుకు వెళ్లాడు. తిరుగుప్రయాయంలో అప్పటికే మద్యం సేవించిన డ్రైవర్ బచ్చన్నపేట నుంచి జనగామకు ప్యాసింజర్లను తీసుకొని బయలుదేరాడు. జనగామ ఎంసీహెచ్ మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న బచ్చన్నపేటకు చెందిన ఉపాధ్యాయుడు మంచాల వెంకటయ్య, దేవరకొండ రాము, లింగాలఘణపురం గ్రామానికి చెందిన కల్యాణికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను మరో ఆటోలో



వివరాలు సేకరిస్తున్న ఎస్సై

జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, తీవ్ర గాయాలైన వెంకటయ్యకు ప్రథమ చికిత్స చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఆటోడ్రైవర్ లింగరాజును పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

'బీజేపీకి గుణపాఠం తప్పదు'

ధర్మసాగర్ : రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం తప్పదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు మల్లయ్య ఆధ్వర్యంలో మండలంలోని కరుణాపురంలోని జాతీయ రహదారిపై ఖాళీ సిలిండర్లతో ఆదివారం నిర్వహించిన ధర్నాలో ఎల్లేష్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యావసర సరుకుల ధరలను ఇష్టారీతిన పెంచుతోందని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపు వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచి పేదల నడ్డి విరస్తోందని మండిపడ్డారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమవడమే కాకుండా భారాలు మోపుతుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో బీజేపీని ప్రజలు గద్దె దింపుతారని స్పష్టం చేశారు. నాయకులు గోకల రాజయ్య, మాలోత్ శంకర్, మునిగాల భిక్షపతి, రీల్ పూర్ణచందర్, స్వరూప లావణ్య, రాజారపు రత్నం, దేవయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొడకండ్ల: గురువులతో పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1982–83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. నాటి గురువులను ఆహ్వానించి పూర్వ విద్యార్థులు కుటుంబసభ్యులతో ఒకే వేదికపై కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల: మండలకేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ చెందిన 1984–85 విద్యాసంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ పూర్వ జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు కమలాకర్‌రావు పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ అర్జుల సుధాకర్‌రెడ్డి, కుర్రె మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు

బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు నాటు వేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. ఈ సంవత్సరం మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల్లో 19వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. కూలీల కొరత ఉండడంతో ఒక్కో కూలీకి రూ.500 నుంచి రూ.600 చెల్లించి వరి నాట్లు వేయించారు. నాటు వేసిన కొద్ది రోజుల్లోనే పంటలను మోగి పురుగు ఆశించడంతో వేల రూపాయలు ఖర్చు చేసి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. సాగుచేసిన పంట కోలుకునే దశలో భూగర్భ జలాలు అడుగంటడం, బోర్లు నీరు తక్కువగా పోస్తుండడంతో ఎండిపోతున్నాయి. బచ్చన్నపేట మండల కేంద్రంలో వరి పంటలు ఎండిపోగా కొందరు రైతులు జీవాలను మేపుతున్నారు. గత సంవత్సరం గోదావరి జలాలు రావడంతో వరి పంటలకు కొంత ఉపశమనం లభించగా ఈ సంవత్సరం



బచ్చన్నపేటలో ఎండిన పొలంలో జీవాలను మేపుతున్న రైతు

సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా గోదావరి జలాలను విడుదల చేయాలని, లేని పక్షంతో పెద్ద ఎత్తున వరి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నెర్రెలు బారిన పొలం